క్లుప్తంగా

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న ఖాండ్రే విశాల్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదులవాడ గణేష్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ హాజరయ్యారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా జంజిరాల కిరణ్, నరేష్, శ్రీకాంత్, సురేష్, ప్రధాన కార్యదర్శులుగా వినోద్, రత్నం, రవీందర్, కార్యదర్శులుగా ప్రసాద్, రమేష్, సభ్యులుగా రాజులను ఎన్నుకున్నారు. బీజేవైఎం మండల అధ్యక్షుడిగా లొనారే మోహన్, బీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా సాయి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా అంకాంత్ రావ్ లొనారే, బీజేవైఎం ఉపాధ్యక్షులుగా నాగరాజు, ప్రసాద్, పవన్‌కుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా లోకండే రాజేందర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు సప్త శ్రీనివాస్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



వాలీబాల్ కిట్ అందజేస్తున్న వినోద్

రెబ్బెన: దేవార వినోద్ యువసేన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని గువ్వలగూడ గ్రామానికి చెందిన యువకులకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవార వినోద్ వాలీబాల్ కిట్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు క్రీడల్లో రాణించాలని తమ వంతు సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు కంటివెలుగు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని బాబాపూర్ గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ లక్ష్మి, వైద్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

కాపువాడలో..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలో గల మున్నూరు కాపు సంఘం భవనంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గిరీష్ కుమార్, వార్డు కౌన్సిలర్ పిర్సింగుల జైచందర్‌లు శిబిరాన్ని ప్రా రంభించారు. వైద్యులు సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

'శాశ్వత గృహాలు నిర్మించాలి'

కెరమెరి: జోడేఘాట్‌లోని గిరిజనులకు ప్రభుత్వం శాశ్వత గృహాలు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గరిపెల్లి కరుణా గౌడ్ అన్నారు. బుధవారం జోడేఘాట్‌ను సందర్శించి భీంకు నివాళులర్పించారు. ఆయన వెంట సత్యనారాయణ గౌడ్, సింగువీరస్వామి, రవి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: ధమాక
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: ధమాక

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

జోరుగా 'ఉపాధి' పనులు!

- పెరుగుతున్న కూలీల సంఖ్య
- 'అమృత్ సరోవర్'పై ప్రత్యేక దృష్టి
- అక్రమాలు జరగకుండా ఫొటో అప్‌లోడ్



దహెగాంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దహెగాం: వేసవిలో వ్యవసాయ పనులు ముగిసిన తరువాత పల్లెల్లో పనులు లేక రైతులు, కూలీలు పట్నాలకు వలస వెళ్లేవారు. వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గాయి. ప్రతీ ఏడాది ఫిబ్రవరి నుంచి వర్షాకాలం ప్రారంభం అయ్యే వరకు ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు చేస్తున్నారు. అధికారులు ప్రధానంగా అమృత్‌సరోవర్ (కుంటల నిర్మాణం)పై ప్రత్యేక దృష్టి సారించారు.

మండలంలో 6300 జాబ్‌కార్డులు..

మండలంలో సుమారు 6,300 జాబ్ కార్డులు ఉండగా 9వేల మంది వరకు కూలీలు ఉన్నారు. అందులో పనులకు వచ్చే వారు సుమారు 6వేల మంది వరకు ఉన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 1400 మంది పనులు చేస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. రానురాను ఈ సంఖ్య వేలకు చేరుతుందని వారు అంచనా వేస్తున్నారు. అమృత్ సరోవర్‌లో భాగంగా ఐనం, ఒడ్డుగూడ గ్రామాలో కుంటలు నిర్మించారు. మండలంలో ఏడు కుంటలు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా అందులో రెండు పూర్తయ్యాయి. మొట్లగూడ, రాంపూర్ గ్రామ పంచాయతీలలో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఆయా గ్రామాల్లో సిగ్నల్ సమస్య ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పని ప్రదేశంలో ఫొటో..

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనికి వచ్చే కూలీల ఫొటోను పని ప్రదేశంలో తీసి అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పని ప్రారంభమైన నాలుగు గంటల తర్వాత మరో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో పనులకు వెళ్లకుండానే కొందరు అక్రమార్కులు వేతనాలు పొందినట్లు పలుమార్లు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఉపాధిహామీ పనుల్లో అవినీతి జరగకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పని ప్రదేశంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ఆధార్‌లింక్ తప్పనిసరి..

ప్రభుత్వం ఉపాధిహామీ కూలీల జాబ్‌కార్డ్‌కు, బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌లింకు తప్పనిసరి చేసింది. ఆధార్ లింకైన ఖాతాల్లో వేతనాలు త్వరగా జమ కానున్నాయి. లింక్ చేయించుకోకపోవడంతో ఇప్పటివరకు రూ.5లక్షల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జాబ్‌కార్డు, ఆధార్ లింక్ చేయించుకుంటే పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులు సకాలంలో అందుతాయంటున్నారు.

వేసవిలో ఉపాధి దొరుకుతుంది



ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిశాయి. పనులు లేక ఖాళీగా ఉంటున్న మా లాంటి కూలీలకు వేసవిలో ఉపాధిహామీ పథకం ద్వారా పని దొరుకుతుంది. పనులు చేసేచోట కూలీలకు కనీస వసతులు కల్పించాలి.

- ఎల్కరి దాము, ఉపాధి కూలీ, దహెగాం

ఆధార్‌లింక్ తప్పనిసరి

జాబ్‌కార్డు ఉన్న వారందరు ఆధార్‌లింక్ తప్పనిసరిగా చేసుకోవాలి. లింక్ చేసుకోవాలని గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. లింక్ చేయించని వారి పేమెంట్‌లో జాప్యం జరుగుతుంది. ఎండలు మండుతున్నందున కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లాలి.

- కల్పన, ఈజీఎస్ ఏపీవో

అటెన్షన్ ప్లీజ్.. వీధి కుక్కలతో ఇబ్బందులు



కౌటాల: మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. కుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులపై నిత్యం దాడులు చేస్తున్నాయి. మేకలు, గొర్రెలు కుక్కల దాడిలో మృత్యువాత పడుతున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారి: నస్రుల్లాఖాన్, ఎంపీడీవో, కౌటాల
సెల్ నంబర్ : 9490034949

అధ్వాన రోడ్లతో అవస్థలు

- ఇసుక ట్రాక్టర్ల రవాణాతో గుంతలు పడుతున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన పంగిడిమాదర నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డు

తిర్యాణి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధిక లోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండడంతో అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 120 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40శాతానికి పైగా ఉండగా మిగతా గ్రామాలకు చెందిన రోడ్లు సైతం ఓవర్‌లోడ్‌తో ఇసుక ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నడుస్తుండడంతో పూర్తిగా చెడిపోతున్నాయి. అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ట్రాక్టర్లలో తరలింపు..

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉండటంతో ఆయా మండలాలకు చెందిన కొందరు ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామ వాగు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మండలంలోని పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి తరలిస్తున్నారు. రోడ్డుపై తారు లేచి ఉండటం దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నిత్యం నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కాగా కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతి లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంగిడిమాదర గ్రామం నుంచి దాంపూర్, కౌటగాం, లింగాపూర్, సిర్పూర్(యూ) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపుతప్పి వాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. రాత్రి పూట ఈ రోడ్డుపై ప్రయాణం ఎంతో ప్రమాదకరమని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ వాహనం నడిపే పరిస్థితి కూడా లేకపోవడంతో ఆదివాసీలకు కష్టాలు తప్పడం లేదు. అయినా ఇసుక ట్రాక్టర్ల రాకపోకలపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

చర్యలు చేపట్టాలి

ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి తరలిస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా పాడవుతోంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ వెళ్లాలంటే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ఆ రోడ్డు గుండా వెళ్లలేని పరిస్థితి ఉంది. - సార రమేశ్‌గౌడ్, గడలపెల్లి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



దహెగాం: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కౌటాల: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాలి కృష్ణమాచారి అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ షరీఫ్‌కు వినతిపత్రం అందించారు.

దహెగాంలో..

దహెగాం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా చట్టం వల్ల క్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఎత్తివేయడంతోపాటు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రమ్మ అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థను పటిష్టం చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు ఎన్నో సేవలు పొందుతున్నారన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మధుకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు జయప్రద, మల్లీశ్వరీ, జ్యోతి, పద్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రమోద్‌కుమార్‌కు అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించి అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పని చేస్తున్న టీచర్లు, వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రహీముద్దీన్‌కు అందజేశారు.



కౌటాలలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



వాంకిడి: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



రెబ్బెన: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



సిర్పూర్(టి): వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

సిర్పూర్(టి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. అంగన్‌వాడీలకు పదవీ విరమణ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

రెబ్బెనలో..

రెబ్బెన: నూతన విద్యాచట్టం ద్వారా అంగన్‌వాడీ సెంటర్లను ఎత్తివేసి ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు, మండల కన్వీనర్ రాజేశ్వరీలు అన్నారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతమ్మ, చంద్రకళ, ప్రమీల, సాంబలక్ష్మి వచ్చలా, మల్లీశ్వరీ, జ్యోతి, పద్మ, మమత పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

దహెగాం: అడవుల సంరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దిగిడ, రాంపూర్ గ్రామాల ప్రజలకు అడవుల సంరక్షణపై కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రాజలింగు కళాజాత బృందం అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అడవికి నిప్పు పెట్టడం వల్ల నష్టాలను వివరించారు. అడవుల వల్ల కలిగే లాభాల గురించి పాటల రూపంలో వివరించారు. అనంతరం తునికాకు సేకరించిన లబ్ధిదారులకు మంజూరైన రాయల్టీ చెక్కులను డీఆర్వో శ్రీధర్‌చారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో బాబు, బీట్ అధికారులు మధూకర్, సద్దాం, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో 'ప్రజాగోస -బీజేపీ భరోసా'

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస -బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, తాలుకా నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ బాలాజీనగర్‌లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

పౌష్టికాహారంపై అవగాహన



విద్యార్థినులతో కేర్ ఇండియా ప్రతినిధులు

వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, బెండార ఉన్నత పాఠశాలల్లో కిశోర బాలికలకు కేర్ ఇండియా ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎత్తుకు తగ్గ బరువు, సమతుల్యత, రక్తహీనత, ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఫోర్ మంత్రాస్ అనే పుస్తకాలను బాలికలకు అందజేశారు. కేర్ ఇండియా మేనేజర్ సంతోష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, సీఆర్పీ పితాంబర్, దివ్య పాల్గొన్నారు.

హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న యాత్ర కన్వీనర్ ప్రణయ్

వాంకిడి: విద్యారంగ సమస్యల అధ్యాయన యాత్రలో భాగంగా బుధవారం బీసీ యువజన సంఘ నాయకులు మండలంలోని వివిధ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యలను పూర్తిగా పరిష్కరించాలనే డిమాండ్‌తో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలు తొలగించి నూతనంగా పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ గడ్డల ప్రణయ్, నాయకులు సిరికొండ సాయికృష్ణ, ఆడె సాయి, పాయి చరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ పోరాట ఫలితమే బస్సు పునరుద్ధరణ'

రెబ్బెన: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా గోలేటి నుంచి మంచిర్యాలకు బస్సు సౌకర్యం పునరుద్ధరించారని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. బుధవారం గోలేటిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేక కొంతకాలంగా సింగరేణి జీఎం కార్యాలయ ఉద్యోగులు, గోలేటి ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. స్పందించిన అధికారులు బస్సు సౌకర్యం కల్పించారన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై మక్కువ పెంచుకోవాలి



ప్రదర్శనలను పరిశీలిస్తున్న కనక యాదవ్‌రావు

నార్నూర్(జైనూర్): విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాలపై మక్కువ పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. బుధవారం జైనూర్ మండల కేంద్రంలోని గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌డేలో పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరికరాల ప్రదర్శనలను పరిశీలించారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూ, తలిబ్ ఉన్నారు.

విశ్రాంత ఆర్మీ జవాన్‌కు స్వాగతం

కాగజ్‌నగర్‌టౌన్: ఆర్మీలో దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొంది బుధవారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న విశ్రాంత ఆర్మీ జవాన్ పీఎస్. యాదవ్‌కు రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అసోసియేషన్ నాయకులు పూలమాలలు, శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించి ప్రత్యేక వాహనంలో ఆయనను తిప్పుతూ పట్టణ వీధుల గుండా ర్యాలీ తీశారు.

ఉద్యోగుల నిరసన

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ ఉద్యోగులు వేతన సవరణ సాధనకు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు బుధవారం కొనసాగాయి. భోజన విరామం సమయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.